క్లుప్తంగా

జీరో బిల్లు అమలు చేయాలి

మరికల్: అర్హులైన వారందరికీ జీరో విద్యుత్ బిల్లు అమలు చేయాలని రైతుల సంఘాల నాయకులు పద్మనాభరెడ్డి, హన్మంతు, రాములు అన్నారు. శుక్రవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ.. ప్రజాపాలనలో ప్రభుత్వం సూచించిన ఆరు గ్యారంటీల పథకాలకు దరఖాస్తు చేసుకున్న వారిలో కొందరికి మాత్రమే పథకలు అందుతున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన వారందరికీ గృహజ్యోతి కింద జీరో బిల్లు, సబ్సిడీ సిలిండర్, రైతు భరోసా పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

జాతీయస్థాయి క్రీడలకు ఎంపిక



మాగనూర్(కృష్ణ): కృష్ణ మండలం కున్సీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి కావలి రఘు జాతీయ స్థాయి షూటింగ్ బాల్ క్రీడలకు ఎంపికైనట్లు పీడీ సామ్య తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని శుక్రవారం రాష్ట్ర షూటింగ్ బాల్ ఉపాధ్యక్షుడు బి.గోపాలం శాలువాతో సన్మానించారు. ఈనెల 21నుంచి 23 వరకు నల్లగొండలో నిర్వహించనున్న జాతీయ స్థాయి క్రీడల్లో రఘు పాల్గొనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు రాజప్పగౌడ్, ఉపాధ్యాయ బృందం, పోలీసులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



కోస్గి రూరల్: ప్రజల్లో ఆర్థిక భరోసా కల్పించేందుకే ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్నట్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గిరిప్రసాద్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. కోస్గికి చెందిన మన్నెరాములుకు రూ.50,000, బలుబద్రాయపల్లి గ్రామానికి చెందిన ఎరుకలి భాగ్యమ్మకు రూ.38,000 చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో సుధాకర్‌గౌడ్, ప్రశాంత్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌టీ లోన్లు చెల్లించాలి



ధన్వాడ: వ్యాపారస్తులు ఎల్‌టీ లోన్లను తిరిగి చెల్లించాలని సింగిల్‌విండో అధ్యక్షుడు వెంకట్రామ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయంలో జనరల్ బాడీ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా జమా ఖర్చుల వివరాలు కమిటీ సభ్యులకు వివరించారు. అలాగే 2025–26 సంవత్సర అంచనా బడ్జెట్ రూ.8.72 కోట్లకు ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎల్‌టీ లోన్లు చాలా వరకు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శివస్వాముల మహాపడి పూజ



అమరచింత: మండల కేంద్రంలో శుక్రవారం శివ మాలధారులు మహాపడి పూజను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. పట్టణానికి చెందిన శివ మాలధారులు తెల్లవారుజామున సమీపంలోని పవిత్ర కృష్ణానది జలాలను జల్దీ బిందెలతో తీసుకొచ్చి శ్రీకృష్ణనగర్‌లోని శివాలయంలో స్వామివారిని అభిషేకించారు. పట్టణ పురవీధుల గుండా శివ పల్లకీ, కలశ ఊరేగింపు చేసి ఆలయంలో మహా పడిపూజ నిర్వహించారు. దీంతో శివ నామస్మరణతో ఆలయ ప్రాగణం పులకించింది. గురుస్వామి కొట్టం విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ పూజారి జంగం శివానంద్ పూజలు చేశారు. పూజకు హాజరైన భక్తులకు అన్న ప్రసాదాన్ని పట్టణానికి చెందిన జరిచీరల వ్యాపారి మహంకాళి శ్రీనివాసులు వితరణ చేశారు.

లక్ష్యాన్ని నిర్దేశించుకొని చదవాలి



మరికల్‌లో విజేతలకు బహుమతులను అందజేస్తున్న ఎస్‌ఐ రాము

మరికల్: విద్యార్థులు లక్ష్యం నిర్దేశించుకొని చదవాలని పాలమూరు యూనివర్సిటీ గోల్డ్ మెడలిస్ట్ సాయిబాబా అన్నారు. మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం మరికల్ టాలెంట్ టెస్టు ఆధ్వర్యంలో పదో తరగతి వార్షిక పరీక్షలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిబాబా మాట్లాడుతూ.. ఉత్తమ ఫలితాలు సాధించేందుకు విద్యార్థులు కృషి చేయాలన్నారు. ముఖ్యంగా సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలన్నారు. పదికి పది గ్రేడ్ సాధించిన విద్యార్థులకు పోలీసు శాఖ తరఫున బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు.

బహుమతుల ప్రదానం..

ఇటీవల మా మిత్ర బృందం నిర్వహించిన మరికల్ టాలెంట్ టెస్టులో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు ఎస్‌ఐ రాము బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి ప్రతిభ స్కూల్‌కు చెందిన అభివర్ధన్ రూ.7,777, సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలకు చెందిన శ్రీవేణికి రెండో బహుమతి కింద రూ. 5,555, కన్మనూర్ ఉన్నత పాఠశాలకు చెందిన మేఘనకు మూడో బహుమతి కింద రూ. 3,333లతో పాటు షీల్డ్ అందజేశారు. అదే విధంగా పాఠశాల స్థాయిలో మొదటి, రెండో బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మా మిత్ర బృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



ధన్వాడలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ధన్వాడ: మిషన్ పరివర్తన గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ డిస్ట్రిక్ సోషల్ వెల్ఫేర్ కార్యాలయం నారాయణపేట ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు డ్రగ్స్ వినియోగం వలన కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలు దాని దుష్పరిణామాలపై కమ్యూనిటీ ఎడ్యుకేటర్ లక్ష్మీకాంత్ వివరించారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నరసింహాచారి, ఫరీదా సుల్తానా, సుభాషిణి, వెంకటమ్మ, సౌభాగ్యలక్ష్మి, సురేష్‌బాబు, వెంకటేశ్, రామకృష్ణ, వెంకటేష్, అశోక్, శ్రీనివాస్ రవి తదితరులు పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయాలి



ఎస్‌ఎఫ్‌ఐ లోగో విడుదల చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

కొత్తపల్లి: భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్‌ఎఫ్‌ఐ) ప్రథమ మహాసభలను విజయవంతం చేయాలని శుక్రవారం మండలంలోని భూనీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్‌ఎఫ్‌ఐ లోగోను నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా కోకన్వీనర్ పవన్ కుమార్, వెంకట్, కాశీ మాట్లాడుతూ.. మండలంలో ఫిబ్రవరి 15న నిర్వహించనున్న మండల ప్రథమ మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ఎస్‌ఎఫ్‌ఐ విద్యారంగ సమస్యలపై అనునిత్యం పోరాటం చేస్తుందన్నారు. ప్రభుత్వ కళాశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మండల కేంద్రంలో ఏర్పాటు, తదితర డిమాండ్లతో ఎస్‌ఎఫ్‌ఐ మహసభలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సభలకు విద్యార్థులు, మేధావులు, ఉపాధ్యాయులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాలి



మాట్లాడుతున్న మేడం ప్రభాకర్

నారాయణపేట రూరల్ : దేశ సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకుంటూ భవిష్యత్ తరాలకు అందిద్దామని ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా సహకార్యవాహ మేడం ప్రభాకర్ అన్నారు. వాలంటైన్ డేకు వ్యతిరేకంగా బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో స్థానిక శ్రీసాయి కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. విదేశీ విష సంస్కృతితో ఎంతోమంది యువత బానిసలుగా మారుతున్నారన్నారు. ప్రేమ పేరుతో మోసాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నతనం నుంచి కష్టపడి పెంచిన తల్లిదండ్రులను వదిలి వెళ్లడం సమంజసం కాదని సూచించారు. ప్రేమ పేరుతో మత మార్పిడులు, విదేశాలకు అమ్మాయిలను అమ్మడం వంటి ఎన్నో ఇబ్బంది గల పరిస్థితులను నిత్యం పత్రికల్లో చూస్తున్నా మార్పు రాకపోవడం బాధాకరమన్నారు. దేశ రక్షణ కోసం 40 మంది వీర సైనికులు చనిపోయిన దినాన్ని మరచి ప్రేమికుల రోజు పేరుతో యువత చెడుదారుల్లో పయనించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ కార్యదర్శి ప్రవీణ్, బజరంగ్‌దళ్ నాయకులు శ్రవణ్, వెంకటేష్, ఆకాష్, రితేష్, నరేష్, మణి, మనోజ్, ఆదిత్య, విష్ణు, గౌరీ, శీను తదితరులు పాల్గొన్నారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

కోస్గి రూరల్: రంగారెడ్డి జిల్లా కోర్టులో న్యాయమూర్తిపై జరిగిన దాడిని ఖండిస్తూ శుక్రవారం కోస్గి కోర్టు న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రంగారెడ్డి జిల్లా కోర్టులో శిక్ష పడిన వ్యక్తి జడ్జితో మాట్లాడుతానని న్యాయమూర్తిపై దాడి చేయడం హేయమైన చర్య అని తెలిపారు. న్యాయవాదుల పరిరక్షణ చట్టం అమలులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతమైతే పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామన్నారు. కార్యక్రమంలో శకనప్ప, సంతోష్‌నాయక్, రాజలింగం, తాజ్‌ఖాన్, రాజురెడ్డి, భీమేష్, తదితరులు పాల్గొన్నారు.

అయోడిన్ లోపంపై అవగాహన



మాట్లాడుతున్న వైద్యుడు శ్రీకాంత్

మద్దూరు: అయోడిన్ లోపాల వల్ల శరీరంలో జరిగే మార్పులు, రుగ్మతలపై ఇనిస్టిట్యూట్ ఫర్ గ్లోబల్ డెవలప్‌మెంట్ ఆశీర్వాద్ స్మార్ట్ ఇండియా ఆధ్వర్యంలో రెనివట్ల ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైద్యుడు శ్రీకాంత్, సంస్థ కోఆర్డినేటర్ ప్రసాద్ శుక్రవారం అయోడిన్ లోపం నివారణపై విద్యార్థులకు సూచనలు ఇచ్చారు. చేపలు, పాలు, పాల పదార్థాలు, ఉసిరి, జామ, ఆకుకూరలు లాంటి పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. సంస్థ ఆధ్వర్యంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో విద్యార్థులకు అవగాహన కల్పింస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజు, వీరన్న, బాలరాజ్, సతీష్, సాయికుమార్, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో షబే బరాత్ వేడుకలు



బహుమతులు పొందిన చిన్నారులతో మతపెద్దలు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని మజీదుల్లో గురువారం రాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు షబే బరాత్ వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈషా నమాజ్ అనంతరం ప్రత్యేక దువా చేశారు. మతపెద్దలు ధార్మిక ప్రసంగాలు చేశారు. స్థానిక న్యూప్రేమ్‌నగర్‌లోని అన్వారే మదీనా మజీద్‌లో మౌలానా రహెమతుల్లా ధార్మిక ప్రసంగం చేశారు. చిన్నారులు నాతేషరీఫ్‌లను ఆలపించారు. ఎదిర రెవెన్యూవార్డులోని జామే మజీద్‌లో నిర్వహించిన షబే బరాత్ వేడుకల్లో మౌలానా హాఫిజ్ మహ్మద్ ఇమ్రాన్ నక్షబంది ధార్మిక సందేశం ఇచ్చారు. అల్లా చివరిదూత మహ్మద్ ప్రవక్త (స.అస) మార్గం అనుసరణీయమని అన్నారు. ప్రవక్త సున్నత్‌లను విధిగా పాటించాలని కోరారు. ఇలాంటి జాగరణ రాత్రుల్లో దువా చేయడంతోపాటు దైవ ప్రార్థనలు చేయాలని సూచించారు. నాతేషరీఫ్‌లను ఆలపించిన చిన్నారులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మజీద్ కమిటీ అధ్యక్షులు అబ్దుల్ హకీం, అజీజుల్లా, మౌలానా హాఫిజ్ ఫేరోజ్ పాల్గొన్నారు.

ఎస్‌బీఐ ఉద్యోగుల నిరసన



స్టేషన్ మహబూబ్‌నగర్: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) ఉద్యోగులు బ్యాంక్‌లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం పట్టణంలోని వివిధ ఎస్‌బీఐ బ్రాంచీల ఉద్యోగులు రాజేంద్రనగర్‌లోని ఎస్‌బీఐ వద్ద శుక్రవారం సాయంత్రం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎస్‌బీఐ అవార్డు స్టాఫ్ యూనియన్ అసిస్టెంట్ జనరల్ సెక్రటరీ వెంకటేశ్వర్లు, రీజినల్ కార్యదర్శి నరేష్ కుమార్, ఆఫీసర్ అసోసియేషన్ రీజినల్ కార్యదర్శి జగన్నాథ్‌రెడ్డి మాట్లాడారు. బ్యాంకుల్లో ఖాళీగా ఉన్న అన్నిస్థాయిల పోస్టులను భర్తీ చేయడంతోపాటు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగ పద్ధతిని తాత్కాలికంగా పనిచేస్తున్న వారిని పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేశారు. బ్యాంకులో ఐదు రోజుల పనివిధానాన్ని అమలు చేయాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్ల పిలుపు మేరకు వచ్చేనెల 24, 25 తేదీల్లో దేశవ్యాప్తంగా బ్యాంక్ ఉద్యోగుల సమ్మె నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ధర్నాలో బ్యాంక్ ఉద్యోగులు పాల్గొన్నారు.

యూసీసీతో ఫెడరల్ వ్యవస్థకు ప్రమాదం

స్టేషన్ మహబూబ్‌నగర్: యూనియన్ సివిల్ కోడ్(యూసీసీ) అమల్లోకి వస్తే దేశ ఫెడరల్ వ్యవస్థకు ప్రమాదమని సామాజిక వేత్త, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు హనీఫ్ అహ్మద్ శుక్రవారం ఒకప్రకటనలో తెలిపారు. మనువాదుల కుట్రలో భాగంగానే కేంద్ర ప్రభుత్వం యూసీసీని దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో అమలుచేయాలని చూస్తుందని పేర్కొన్నారు. రాజ్యాంగానికి విరుద్ధంగా ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం నడుచుకుంటున్నదని ఆరోపించారు. ఇప్పటికైనా దేశప్రజలు, మేధావులు, సామాజిక కార్యకర్తలు, విద్యావేత్తలు ఇలాంటి విధానాలపై సంఘటితంగా పోరాటాలకు సిద్ధంకావాలని ఆయన పిలుపునిచ్చారు.

బీసీలకు రూ.50వేల కోట్లు కేటాయించాలి

మహబూబ్‌నగర్ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టబోయే వార్షిక బడ్జెట్‌లో బీసీలకు జనాభా దామాషా నిష్పత్తిన బడ్జెట్‌లో రూ.50వేల కోట్లు కేటాయించాలని బీసీ జాగృతి సేన వ్యవస్థాపక అధ్యక్షుడు బూర్గుపల్లి కృష్ణయాదవ్ డిమాండ్ చేశారు. బీసీ జాగృతిసేన ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టర్ విజయేందిర బోయిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ ఉప ప్రణాళిక ఏర్పాటుచేసి ప్రతి వార్షిక బడ్జెట్‌లో అదనంగా రూ.20వేల కోట్లు కేటాయిస్తామని ప్రభుత్వం పేర్కొందని అన్నారు. కానీ గతేడాది రూ.20 వేల కోట్ల బడ్జెట్ కేటాయించకుండా విస్మరించిందని, ఈసారైనా రూ.40 వేల కోట్ల బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో బీసీ జాగృతి సేన కార్మిక విభాగం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సురభి విజయ్‌కుమార్, నాయకులు జి.నర్సిములు, గోపాల్, వెంకటేష్, రాజు తదితరులున్నారు.

నేడు సేవాలాల్ జయంతి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లా కేంద్రంలోని అయ్యప్ప కొండపై ఉన్న మహారాజ్ దేవాలయంలో శనివారం సేవాలాల్ మహారాజ్ జయంతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సేవాలాల్ మహరాజ్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు రామచంద్రనాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మహాభోగ్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్ హాజరు అవుతారని, బంజారులు అధిక సంఖ్యలో హాజరుకావాలని ఆయన కోరారు.

30 శాతం నిధులు కేటాయించాలి



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు గౌస్

కోస్గి : రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి బడ్జెట్‌లో 30 శాతం నిధులు కేటాయించాలని పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు గౌస్ అన్నారు. తక్షణమే పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్ నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని ఎస్‌ఆర్‌వీ డిగ్రీ కళాశాల, జూనియర్ కళాశాల, మండల పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పెండింగ్ స్కాలర్‌షిప్‌లు మంజూరు చేయాలని సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం కావస్తున్నా విద్యాశాఖ మంత్రిని ఏర్పాటు చేయకపోవడం విచారకరమన్నారు. వెంటనే విద్యాశాఖ మంత్రిని నియమించాలన్నారు. కార్యక్రమంలో సాగర్, నరసింహ, అంజి, నవనీత, కవిత, భాస్కర్, విజయ్, నందిని తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి



వైద్యురాలు శిల్పకు వినతిపత్రం అందజేస్తున్న గోవిందురాజు

మక్తల్: మండల కేంద్రంలోని ఏరియా ఆస్పత్రిల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ సిబ్బంది 5 నెలలుగా జీతాల అందక ఇబ్బందులు పడుతున్నారని , వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం సీఐటీయూ జిల్లా కార్యదర్శి గోవిందురాజు ఆధ్వర్యంలో వైద్యురాలు శిల్పకు వినతిపత్రం అందజేశారు. కార్మికులు చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. కార్మికులకు కనీసం రూ.26 వేల వేతనం ఇవ్వాలని పీఎఫ్, ఈఎస్‌ఐ తదితర సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో మధు, భీమ్, బాల్‌రాజు, నరేష్, మహబూబ్, జములమ్మ, నర్మ, సంధ్య, తిప్పమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

హిందూవాహిని కమిటీ నియామకం



మట్లాడుతున్న సుదర్శన్‌గౌడ్

ధన్వాడ: హిందూవాహిని మండల సంయోజన్‌గా జట్ల కల్యాణ్‌గౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు జిల్లా సంయోజన్ సుదర్శన్‌గౌడ్ తెలిపారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో సహ సంయోజన్‌గా శివయాదవ్, మహేష్, గోరక్షగా శివకుమార్, సందీప్, మీడియా ఇన్‌చార్జి శ్రవణ్, బేటీబచావ్ బంటి, శివకుమార్, సంపర్క్ ప్రముఖ్ ఆదర్శగౌడ్, విద్యార్థి ప్రముఖ్ అరుణ్‌కుమార్, గణేష్, సభ్యులు సాయిచరణ్, సాయికుమార్, శ్రావణ్, భాను, భానుప్రకాష్, నవీన్ ఎంపికైనట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ తల్లిదండ్రులను గౌరవించాలి



తల్లిదండ్రులకు పాదపూజ చేస్తున్న విద్యార్థులు

నారాయణపేట ఎడ్యుకేషన్: ప్రతి ఒక్కరూ తల్లిదండ్రులను గౌరవించాలని విద్యాపీఠం నారాయణపేట జిల్లా అధ్యక్షుడు గోపాల్ బాయి బాల్‌రాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం పదో తరగతి విద్యార్థుల చేత తల్లిదండ్రులకు పాదపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాల్ బాయి బాల్‌రాజ్, ప్రధానోపాధ్యాయుడు దత్తు చౌదరి మాట్లాడుతూ... సమస్త భూమి కంటే బరువైనది తల్లి, ఆకాశం కన్నా ఉన్నతుడు తండ్రని తల్లిదండ్రులకు నమస్కరిస్తే గోవును దానం చేసిన ఫలితం దక్కుతుందన్నారు. నేటి కాలంలో పిల్లలు తల్లిదండ్రులు ఎన్నో కష్టాలు పడి పెంచితే ఉన్నత స్థితికి రాగానే వారిని వృద్ధాశ్రయంలో వదిలేస్తున్నారని ఆవేదనను వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరు తల్లిదండ్రులను ఆరాధ్య దైవంగా పూజించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అమర జవాన్లకు ఘన నివాళి



మక్తల్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు

మరికల్: పుల్వామా ఉగ్రదాడిలో అసువులు బాసిన భారత వీర జవాన్లకు శుక్రవారం మరికల్ చౌరస్తాలో కొవ్వొత్తులతో ఘన నివాళ్లులర్పించారు. ఈ సందర్భంగా జవాన్ల చిత్రపటాలకు నివాళులర్పించి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో యువక మండలి అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, నర్సన్‌గౌడ్, తిరుపతి రెడ్డి, రాజేష్, భాస్కర్, వేణు, గోపాల్, తిరుపతయ్య, కుర్మయ్య, నిఖిల్, రమేష్, రవి, వెంకటేష్, చెన్నయ్యలు పాల్గొన్నారు.

మక్తల్: పుల్వామా దాడిల్లో అమరులైన వీర జవాన్లకు స్మరించుకుంటూ వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాల్లో కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. జవాన్ల త్యాగాలు చిరస్మరణీయమని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి భీంరెడ్డి, సత్యనారాయణగౌడ్, మల్లికార్జునరావు, మిలాన్, పస్పుల బీమేష్, రాహుల్, రామాంజనేయులు, అక్షయ్, శివ, నాగరాజు, అంజి, అనంద్, శ్రీను, మహేష్, అంజన్‌ప్రసాద్ , మణికంఠ తదితరులు పాల్గొన్నారు.



మరికల్‌లో అమర జవాన్ల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న యువకులు

టెక్నాలజీని సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంఈఓ నిజాముద్దీన్

మాగనూర్(కృష్ణ): కృష్ణ మండలం కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(కన్నడ మాధ్యమం) విద్యార్థులకు కన్నడ భాషా ప్రాధికార సంస్థ విభాగం బెంగళూర్ వారు రూ. 5 లక్షల విలువ కలిగిన టీవీ(జనరేటర్, కబోర్డ్)లను వితరణ చేసినట్లు ఇన్‌చార్జి ఎంఈవో నిజాముద్దీన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేస్తూ వారిని టెక్నాలజీ చదువువైపు సాగించాలనే లక్ష్యంతో ప్రాధికార సంస్థ ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కిషోర్ కుమార్, గడినాడ కన్నడ సంఘం సంస్థాగత అధ్యక్షుడు నరసింహయ్య శెట్టి, ఉపాధ్యాయులు నాగభూషణం, నాగరాజ్, రేణుక తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో పనిచేసే వారికే గుర్తింపు

మక్తల్: సమాజంలో ఉన్నతంగా పనిచేసే వారికే గుర్తింపుఉంటుందని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. ఉమ్మడి మహబూనగర్‌లో జిల్లా ఎస్పీ కార్యాలయంలో సీఐగా విధులు నిర్వహిస్తున్న ఎల్ రాములు పదవీ విరమణ సందర్భంగా మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే హాజరై రాములను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మక్తల్ మున్సిపల్ చైర్ పర్సన్ రాధమ్మ, మాజీ ఎంపీపీ చంద్రకాంత్‌గౌడ్, డైరెక్టర్ రంజిత్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ కోళ్ల వెంకటేష్, శ్రీనివాసులు, చిన్న హన్మంతు, తిరుపతి, చంద్రశేఖర్, చెన్నయ్యగౌడ్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

త్రిఫ్ట్ ఫండ్‌కు దరఖాస్తుల ఆహ్వానం

అమరచింత: చేనేత కార్మికుల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన త్రిఫ్ట్‌ఫండ్ పథకానికి సంబంధించి అర్హులైన కార్మికులు తమ వ్యక్తిగత దరఖాస్తు పత్రాలను శనివారం జౌళీశాఖ కార్యాలయంలో అందించాలని చేనేత జౌళీశాఖ ఏడీ గోవిందయ్య కోరారు. జిల్లాలోని అమరచింత, కొత్తకోట, తిప్పుడంపల్లి, వెల్టూరు, ఖిల్లాఘనపురంతో పాటు ఆయా గ్రామాల్లో చేనేతకార్మికులు మగ్గానికి ఇద్దరు చొప్పున జియోట్యాగింగ్ నంబర్ ఆధారంగా దరకాస్తు చేసుకోవాలని సూచించారు. లబ్ధిదారులు ఆర్‌డీ 1 బ్యాంక్ ఖాతాలో తమ నెలసరి వేతనంలో 8 శాతం జమచేయాలని, శనివారం పూర్తి వివరాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు.